హైక్లాస్ కోరిక

యం. మహేశ్వర్

ఎదురొచ్చే గాలిని తోసుకుంటూ వచ్చిన సైకిలు మీద నుంచి దిగాడు రామారావు.

ఇంట్లో అడుగు పెడుతూనే, గాజు గ్లాసుల మోత గుండె — లదిరేలా వినిపించింది. ఈ వేళం నాశనమైందో అనుకుంటూ బూట్లిప్పకుండానే వంటింట్లోకి ప్రవేశించాడు. ఏముంది తమ చిన్న సుపుత్రుడు బెల్లం డబ్బా కోసమని వేట ప్రారంభించాడు యింట్లో తల్లి లేదుకదా అని. బెల్లం డబ్బా సంగతి దేవుడెరుగు, ముందు అరడజను గ్లాసులు వరుసగా వకదాంట్లో ఒకటి పెట్టివున్నాయి, వొక్కటీ మిగలకుండా టపాకాయల్లా పేలిపోయాయి. ఆఫీసులో పనిచేసి అలిసివచ్చిన కోపంతో నాలుగు తగిలించాడు. వాడు తగిలిన రెండు దెబ్బలకే తల్లి దగ్గరకు కడుపు పట్టుకొని పరుగుతీశాడు.

కాసేపటికి, "కాసేపెక్కడికైనా వెడితే చాలు యిల్లు గోల అయిపోతుంది" అంది క్రింద పడి ఉన్న గాజుముక్కల్ని ఎత్తుతూ సావిత్రి.

"అయినా గాజు వస్తువులు అంత అజాగ్రత్తగా పెట్టడమేమిటి తప్పంతా నీది" అన్నాడు షర్టు గుండీ లిప్పుతూ, రామారావు.

"అవునులేండి మీగామాటంటారని నా కెప్పుడో తెలుసు, నాలుగు నెలలనుంచీ అవక్కడే వున్నాయి. ఈ వేళంటే ఆ వెధవ బెల్లం కోసమని తగలేశాడు."

"అవి అసలు అప్పుడే పగిలేవి. నిన్న కొట్టుకెళ్ళి బెల్లం తేవడం, అది డబ్బాలో వేయడం, దాన్ని వాడు చూస్తూండగానే వాటి వెనకాల పెట్టడం ఈ రోజు పగలడానికి కారణం."

"పోయిన వస్తువు తిరిగిరాదు. యింక ఆ సంగతి వదిలేయండి."



"వదిలేయకేం చేస్తాంలే, మొన్న మీ చెల్లెలి కొడుకు బంగారంలాంటి అద్దాన్ని పగలగొట్టినపు డూరుకోలేదా, మీ తమ్ముడుగారి సుపుత్రుడొచ్చి అలారమ్ టైమ్‌పీస్‌లో ఏ భాగానికి ఆ భాగం వూడదీసినపు డూరుకోలేదా" అంటూ వరుసగా చెప్పుకొస్తున్న భర్త మాటకి,

"ఇంక ఆపండి బాబు, మా వాళ్ళు మన యింటికి రావడం యిష్టంలేదని ఒక్క ముక్కలో చెప్పకూడదూ" అంది.

"వచ్చినందుకు నేనేమనటల్లేదు సావిత్రి, వచ్చినపుడు పిల్లల్ని జాగ్రత్తగా చూడాలి. అంతగా చూడలేకపోతే పిల్లల్ని యింట్లో పెట్టి తాళం వేసి రావాలి, లేకపోతే వాళ్ళలా వస్తువుల్ని పాడుజేస్తే మళ్ళీ మనం అంతంత ఖరీదుపెట్టి కొనగలమా చెప్పు."

"చెప్పడం తేలికండి, పిల్లలు చిన్నపుడు కాకపోతే అల్లరి మరెపుడు జేస్తారండి. ఇంకా వీళ్ళు నయమే, మీరు చిన్నపుడు చేతిలో ఏ వస్తువుంటే అది విసిరికొట్టేవారట."

"ఊ... ఈ విషయం నీ కెవరు చెప్పారేమిటి" అన్నాడు చేసిన తప్పను కప్పిపుచ్చాలని ప్రయత్నిస్తూ.

"మీ అమ్మగారే"

"చచ్చాంరా భగవంతుడా" అనుకొని, "ఈ విషయం పెద్దగా అనకు మనవాడు వింటే తగలేయడానికి ఈ రోజే ప్రారంభోత్సవం చేస్తాడు."

"అన్నట్టు ఈ గొడవల్లోపడి మీకు కాఫీ యివ్వడమే మరిచిపోయాను" అంటూ ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి భర్తకందించింది.

"ఏమండి నిన్న మన యింటివాళ్ళు 'కృష్ణవేణి' సినిమాకి వెళ్ళారట, చాలా బావుందిట." అంది వాలు కుర్చీలో కూర్చుని కాఫీ త్రాగుతున్న భర్తతో.

"అయితే ఏమిటంటావ్, వెళ్దాంలే యిప్పుడు చాలా రద్దీగా వుందని మా స్నేహితుడొకడన్నాడు, అది నువ్వన్నట్లుగా బావుంటే యిప్పుడప్పుడే పోదు ఒక వేళ పోతోందంటే ఆ సినిమా చూసేట్టుగా వుండుండదు."

"సరేలేండి మీ యిష్టం", అంటూ భర్త

హై క్లాస్ కోరిక

నమ్మా నమ్మకపో

- ★ జిరాఫీ నిల్చొనే నిద్రపోతుంది కూర్చుని నిద్రపోతే దాని శత్రువు వచ్చినపుడు తొందరగా లేవలేదుగనక
- ★ మనం నిత్యం చూసే సినిమాలో ఒక సెకను మనం చూసే బొమ్మ — (24) యిరవయి నాలుగు విడి విడి బొమ్మల కలయిక
- ★ ఖడ్గమృగం ముక్కుమీద వుండేది నిజంగా కొమ్ము కాదు జడలు కట్టిన కొన్ని రోమసముదాయం —సి లక్ష్మి

త్రాగిన కాఫీ కప్పునందుకొని వంటింటి ముఖం పట్టింది

* * *

రామారావు గుమాస్తా వచ్చే జీతం సరిపోక తనకు తెలిసిన హోమియో వైద్యం చేస్తుంటాడు దానిమీద ఆదాయం ఎంత వచ్చినా చూసేవారికి గుండె ఆగినంత పనయ్యేది తన జీతం, ఈ ఆదాయం కలిపి సంసారాన్ని నెట్టుకొస్తూ వుండే వాడు ఆడదానికి నగలమీద, బట్టలమీద ఆశెక్కు వంటారు, అట్లాగే సావిత్రికి కూడా మొదట్లో చీకాకుపడినా చివరికి భార్య కోరికను తీర్చేవాడు భర్త పిల్లలు ముగ్గురైనా ఆ యింటిని కురుక్షేత్రంగా మార్చగలిగే సమర్థులు అద్దె కొంపల్లో తు దాచుకునే మధ్య తరగతివారైనా ఏం చేసినా గుట్టుగా కనిపించాలని భార్య, మనం చేసేది దొంగ తనమూ గుట్టుగా వుండటానికి అని భర్త, ఈ విష యంలో వారి కెన్నోసార్లు మాటా మాటా వచ్చాయి వీరు ఏ వస్తువు కొన్నా చూసేవారికి బాధగానే వుండేది ఇంటివారు అది తెలియగానే అద్దె కాస్త పెంచడం, బంధువులు వీళ్ళకేమిటి వీళ్ళు బాగనే వున్నారు కదా అని రకరకాలుగా అనుకునేవాళ్ళు ఎవరేం అనుకున్నా లెక్కచేసేవాడు కాదు రామారావు

ఒకసారి సావిత్రి విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతుంటే తన మందులను వేసి చూశాడు కానీ ఫలితం లేకపోయింది ఇంటి మందులు యింటి వారికి పనిచేయవని హాస్పిటల్‌లో చేర్చాడు ఇంట్లో పిల్లల సంగతి, హాస్పిటల్‌లో భార్య సంగతి, ఆఫీసులో తన సంగతి చూసుకోలేక దగ్గరలోనే వుండే సావిత్రి అక్కగారికి రమ్మనమని కబురు చేశాడు కానీ అతని కబురుకి విలువ లేకపోయింది కారణం 'నేనొచ్చి అక్కడ కూర్చుంటే యిక్కడ నా సంసారం ఏంగానూ' అని చీటీ వ్రాసి పంపింది తమ అత్త గారు దగ్గరున్నా కనీసం చూడటానికైనా వెళ్ళ లేదు

ఆ మాట రామారావు గుండెల్లో చెరగని ముద్ర వేసింది ఏమీ తోచక ఆలోచిస్తున్న అతను, చివరికి స్నేహితుడు కృష్ణమూర్తిగారికి కబురు చేశాడు వెంటనే అతను తన భార్యతోసహా వచ్చి అవసరం తీరాక వెళ్ళిపోయారు అప్పటినుంచి రామారావుకి బంధువులకంటే మిత్రులే నయం అనిపించింది

* * *

ఆరోజు ఆదివారం కారణం రామారావుకి గంటలు నిముషాల్లా గడిచినట్లనిపిస్తున్నాయి

"ఏమండీ ఈవేళ శలవుకాబట్టి 'కృష్ణవేణి' సినిమా కెళదామండి" ఆశగా అంది సావిత్రి

"శలవురోజున మనకి టిక్కెట్లు ఎలా దొరుకు తాయే" అన్నాడు భర్త

"సినిమా వచ్చి అరవై రోజులయింది ఇంకా దొరక్కపోవడమేమిటండి, అయినా శలవురోజు కాకపోతే మీకెపుడు తీరుబడి అవుతుంది ఆఫీసున్న రోజుల్లో అయితే మీకూడా యింటికి ఓ పేషంట్‌ని తీసుకొస్తారు ఈ రోజు ఎవరూ రారుకదా అని అడిగాను మీయిష్టం'

"సరే అయితే నడవండి, సైన్యమంతానా ?" అన్నాడు

"పెద్దవాడయితే ఎప్పుడో చూసేశాడు ఇంక మిగిలింది యిద్దరేగా, వాళ్ళూ వస్తామని వారం నుంచి గొడవచేస్తున్నారు"

"ఇంక పెద్దవాడికి పనేముంది మిగిలినవాళ్ళు వస్తామని అంటున్నారు అంటున్నావు ఈ ప్రోగ్రాం వారంక్రితమే నాకు తెలియకుండా సెటిల్ చేశావన్న మాట, అప్పుడే ఒంటిగంటవుతోంది త్వరగా తెములు"

"మనమెళ్లేది మ్యాట్నీకా ?"

"కాదు ఫస్టుషోకి, మ్యాట్నీకయితే ప్రొద్దుట కాఫీ త్రాగే బయలుదేరేవాళ్లం"

"అయినా, యింత ముందేమిటండి బహుశా ఆ థియేటర్లో మనమే వుంటామేమో"

"ముందేమిటి, నీ బట్టల సెలక్షన్ అరగంట, కట్టుకోవడం గంట, పిల్లల్ని ముస్తాబు చేయడం గంట, మీ పెద్దాడికి అప్పగింతలు అప్పజెప్పడం గంట, బస్సుదగ్గర వెయిటింగు రెండు గంటలు, ఊ ముందూ వెనుక ఆలోచించక త్వరగా తెముల"

పనులన్నీ పూర్తి చేసుకొని తయారయ్యే టప్పటికి నాలుగయింది ఇంతలో ఆ టాక్సీ చప్పుడు వీరి చెవిన బడింది అరగంట ముందే తయారై బ్యాండు మేళం డ్రస్సులో వున్న తమ యిద్దరు పిల్లలు లోపలికి పరిగెత్తుకుంటూ వచ్చారు "అమ్మా పిన్నొచ్చింది" అన్నారు బూటు త్రాడు బిగించుకుంటున్న తండ్రి వులిక్కిపడేలా చేతిలో బ్యాగ్ నాడించుకుంటూ "ఏమండోయ్ బావున్నారా" అంటూ లోపలికి ప్రవేశించింది రామారావు మరదలు రూపాదేవి టాక్సీలో వున్న పెట్టె, బెడ్డింగు పట్టు కొని లోపలపెట్టాడు, రామారావు తమ్ముడు మోహనరావు

"అన్ని సామాన్లు తెచ్చినట్లేగా, ఇంకా టాక్సీ వాడు అక్కడే వున్నాడేమిటి ?" అన్నాడు మనసులో దాగియున్న సినిమా కోరికను చంపుకుంటూ రామారావు

"ఆ అన్నట్టు మరచాను నీ దగ్గర అయిదు రూపాయలుంటే యిద్దూ టాక్సీవాడి కివ్వాలి, నా దగ్గర అయిదే వుంది మిగిలింది చిల్లరగా లేదు" అన్నాడు

"అలాగా" అంటూ అయిదు రూపాయలున్నా యివ్వకుండా తప్పించుకుందామని, "నా దగ్గర పది రూపాయల నోటే వుందిరా" అన్నాడు

"పరవాలేదన్నయ్యా పదిరూపాయలే అయింది" అంటూ ఆ పది రూపాయల నోటును అందు కున్నాడు

నిరాశగా నోటును జారవిడిచిన రామారావు "పిల్లలేరిరా" అన్నాడు

"టాక్సీ సరదా తీరలేదట్టుంది, వాళ్ళింకా టాక్సీలోనే వున్నట్టున్నారు" అంటూ టాక్సీ దగ్గరి కెళ్ళాడు మోహన్

డబ్బిచ్చి టాక్సీవాణ్ణి పంపించి, పిల్లల్ని తీసు కొని గదిలోకొచ్చి వాలు కుర్చీలో వాలాడు 'హమ్మయ్యా' అంటూ

పాపం 'సినిమా కెళుతున్నాం కాస్త మా యింటిని చూస్తూ వుండండి' అని చెప్పడానికి ప్రక్కింటి కెళ్ళినట్టుంది ఇంట్లోకి రావడంతోటే క్షణంసేపు భయంతోనిస్తేజ అయిపోయిందిసావిత్రి

"ఏం వదినా అలాగే వుండిపోయేవు ?" అన్నాడు మోహన్

సావిత్రి సంగతి తెలుసుకున్న రామారావు "మీరు యింత కాలానికి వచ్చారు కదా, అయినా యిదివరకొచ్చినప్పుడు ముగ్గురే వచ్చారు యిపుడు అయిదుగురయ్యారు కదా, అందుకని" అని సర్దేశాడు

"వీడు మీకు తెలుసు నంబర్ 'వన్' శీనుగాడు, వీడు నంబర్ 'టూ' మధు, నంబర్ 'త్రీ' గోపి" అని చెప్పుకొస్తున్న రామ్మోహన్‌తో "నంబర్ ఫోర్'ని వచ్చేసారొచ్చేటప్పటికి పేరు పెట్టి తీసికొస్తావన్న మాట అనగానే "లేదురా 'త్రీ' తోటే ఫుల్‌స్టాపు పెట్టించేశాను" అన్నాడు నవ్వుతూ

వీళ్ళిలా మాట్లాడుతుండగానే రూపని లోపలికి తీసికెళ్ళింది సావిత్రి

"మీ వాలకం చూస్తుంటే ఎక్కడికో బయలు దేరబోతున్నట్టున్నారే" అన్నాడు మోహన్

"ఏం చెప్పాలో తోచక, సినిమా అంటే యింకా టైముంది మేంగూడా వస్తామంటే నా పర్సు పూర్తవడమే కాకుండా అది అమ్మాల్సి వస్తుందేమో అని మనసులో అనుకొని "ఆ ఏం లేదురా బజారు కెళదామనుకున్నాం" అన్నాడు.

"అయితే ఆలస్యం దేనికి అందరం వెళదాం నడవండి" అన్నాడు

గుండాగినట్లయింది రామారావుకి కానీ ఏం చేస్తాడు తమ్ముడి బలవంతంతో బయలుదేరక తప్ప లేదు పర్సు పూర్చే యోగం అనేదుంటే ఎలా గయితేనేం

వారం రోజులు గడిచాయి

"ఇంకమేం వెళదామనుకుంటున్నాంఅన్నయ్యా" అన్నాడు చావు కబురు నెమ్మదిగా చెప్పినట్లు

అలాగే అన్నాడు వాళ్ళనెపుడు ఎలా వదిలించు కోవాలా అని ఎదురుచూస్తున్న రామారావు

ఆ మాట అన్న నాలుగు రోజుల తరువాత కదిలింది తమ్ముడి సైన్యం

(47వ పేజీ చూడండి)

హై క్లాస్ కోరిక

(30వ పేజీ తరువాయి)

"మనమనుకున్నది వెంటనే ఎపుడూ జరగలేదు, నేనేమన్నా రత్నాలహారం కావాలన్నానా, పట్టుచీర కావాలన్నానా, ఏం పెద్ద కోరిక కోరాను?" అని సాధించసాగింది సావిత్రి

"నువ్వు ఏ కోరిక కోరలేదు బాబూ, అయినా కోరినవన్నీ యివ్వడానికి నేనేం వరాల దేవుణ్ణి కాను" అన్నాడు

"అవునులేండి, ఆ రోజు సినిమాకని ఎంతో ఆశతో తయారైన తరువాత మీవాళ్ళొచ్చినా, వాళ్ళకేమన్నా అమర్యాద చేశానా, పది రోజులపాటు పుష్టిగా మేపేను" అంది సావిత్రి

"కాదన్నానా నువ్వు ఆ సినిమా చూడటమేగా కావలసింది — తయారవ్వు త్వరగా, అయిదవుతోంది" అన్నాడు

"మరి ఆ రోజు ఫస్ట్ షో కని ఒంటిగింటకే వెళలమన్నారు మరి ఈ రోజూ ఆదివారమే, టిక్కెట్ల సంగతో ?"

"అది నీ కనవసరం, అయినా మూడు గంటల ముస్తాబుకి పిల్లలు సర్కసు కెళ్ళారుగా త్వరగా తయారుకా"

అరగంటలో తయారై, ఆటో ఎక్కారు పావు గంటలో థియేటరుముందు ఆగింది ఆదివారం కనుక జనం చాలామందున్నారు ఆటోవాడికి డబ్బులిచ్చి టికెట్టు కౌంటరు వైపు నడిచారు అన్ని క్లాసుల్లో టిక్కెట్లు అయిపోయాయి

మధ్యతరగతివారి రాహతుకు సరిపోయే రెండు రూపాయల కౌంటరు దగ్గర సోల్డ్అవుట్ బోర్డును చూసిన సావిత్రి గుండెలో రైళ్ళు పరిగెత్తినట్లయ్యాయి కారణం ఆ రోజూకూడా తావూ సినిమా చూడలేమేమో అని

ఒక మూడున్నర కౌంటరు వద్ద మాత్రం టిక్కెట్లు యింకా అమ్ముతున్నారని, కంగారు వచ్చి టిక్కెట్లు కొనే కొందరిని చూసి అటువైపు నడుస్తూ, జేబులోంచి పర్సును బయటకు తీస్తూ, అందులోంచి పది రూపాయల నోటును తీశాడు

"అంతపెట్టి ఆ సినిమా చూడకపోతే ఏమండి" అంది సావిత్రి

"నోరెత్తకు" అంటూ రెండు టిక్కెట్లు తీసి కొని మేడపైకి నడిచాడు

అంత టిక్కెట్టు కొని సినిమాకి వెళ్ళడం అదే మొదటిసారి

ఎలాగయితేనేం సినిమా చూశారు

"నీ కోరిక తీరిందా?" అన్నాడు సినిమానుండి బయటకు వస్తూ ●